

చెత్తశుద్ధి ఏదీ?



● ఇదీ జిల్లా కేంద్రం శివారున ఉన్న డంపింగ్ యార్డు. ఇక్కడ చెత్త నిల్వలు భారీగా పేరుకుపోయాయి. చెత్త సంపద కేంద్రం ఏర్పాటు కాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గత ఏడాది కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర స్వచ్ఛ పార్వతీపురం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయితే ప్రజారోగ్యశాఖాధికారులు తడి, పొడి చెత్తల సేకరణకే పరిమితమవుతున్నారు.

● పార్వతీపురంలో చెత్త సంపద కేంద్రం ఏర్పాటెప్పుడో?
● ప్రచారం వరకే తడి, పొడి చెత్త సేకరణ
● ఏళ్లు గడుస్తున్నా ఆ దిశగా పడని అడుగులు
● ఎనర్జీ తయారీకి మున్సిపాల్టీలో వ్యర్థాలను కోరిన 'జిందాల్'
● అయినా చొరవ చూపని అధికారులు, ప్రజాప్రతినిధులు
● గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కదలికలు
● ఆ తర్వాత అటకెక్కిన వైనం

పార్వతీపురం టౌన్, మే8(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మున్సిపాల్టీలో చెత్త సంపద కేంద్రం ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవంగా 2002లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రం శివారున ఉన్న డంపింగ్ యార్డులోనే చెత్త సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రూ.20 లక్షలతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించగా.. అప్పటి పాలకవర్గం కూడా ఆమోదం తెలిపింది. స్థల పరిశీలన కూడా చేశారు. అయితే ఆ తర్వాత ఏమైందో ఏమో చెత్తశుద్ధి కేంద్రం ఏర్పాటు అటకెక్కిందనే చెప్పాలి.


ట్రాక్టర్‌లో చెత్తను తరలిస్తున్న దృశ్యం


ఓ వీధిలో పేరుకుపోతున్న చెత్త

ప్రచారానికే పరిమితం..

● స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా 2014 నుంచి మున్సిపాల్టీలోని 30 వార్డుల్లో పొడి, చెత్తలను సేకరించడం ప్రారంభించారు. పర్యావరణానికి హాని కలిగించే వాటిని ధ్వంసం చేయడంతో పాటు సేంద్రియ ఎరువుల తయారీకి ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ప్రజలు ఇవ్వాలని ప్రచారం నిర్వహించారు. ప్రచారం అయితే విజయవంతమైంది కానీ చెత్త సంపద కేంద్రం ఏర్పాటు మాత్రం కలగానే మిగిలిపోయింది వ్యర్థాల నుంచి ఆర్థికాభివృద్ధి సాధించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రసంగాలు ఇస్తున్నారే తప్ప ఆచరణ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

● మున్సిపాల్టీలో 70 వేలకు పైబడి జనాభా ఉంటారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత పార్వతీపురం చుట్టూ పుట్టగొడుగుల్లా కాలనీలు వెలుస్తున్నాయి. రోజురోజుకూ పట్టణ జనాభా పెరుగుతోంది. ఇదే సమయంలో 30 వార్డుల నుంచి రోజూ పారిశుధ్య కార్మికులు 10 టన్నుల నుంచి 15 టన్నుల వరకు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. భవిష్యత్‌లో 20 నుంచి 30 టన్నుల వరకు (మిగతా 6వ పేజీలో)

ప్రణాళికలు సిద్ధం చేస్తాం..

చెత్తశుద్ధి కేంద్రం ఏర్పాటుకు గతంలో ఉన్నతాధికారులు ప్రతిపాదనలు చేశారు. దీనికి సంబంధించి త్వరలోనే ప్రణాళికలు సిద్ధం చేస్తాం. స్వచ్ఛ పార్వతీపురం కార్యక్రమానికి మా వంతుగా కృషి చేస్తున్నాం.

- కె. పకీరురాజు, ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్, పార్వతీపురం మున్సిపాల్టీ

శ్యామలాంబ ఉత్సవాలకు

పక్కాగా ఏర్పాట్లు

● శిథిల భవనాలపై భక్తులు ఎక్కకుండా చూడాలి
● ఇన్‌చార్జి కలెక్టర్ శోభిక


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శోభిక

పార్వతీపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): సాలూరు శ్యామలాంబ ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ శోభిక అధికారులను ఆదేశించారు. గురువారం సంబంధిత అధికారులతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి 20 వరకు ఉత్సవాలు జరుగనున్నాయని తెలిపారు. 15 ఏళ్ల తర్వాత జరగనున్న ఉత్సవాలు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జాతరలో భక్తులు శిథిలావస్థ భవనాలపై ఎక్కకుండా చూడాలని ఆదేశించారు. 'తాగునీరు, విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయాలి. పూర్తిస్థాయి పారిశుధ్య పనులు చేపట్టాలి. సిరిమాను తిరిగే మార్గాల్లో ఎక్కడా గతుకులు లేకుండా చర్యలు తీసుకోవాలి. వాహనాల పార్కింగ్ కోసం ఐదు ప్రదేశాలను గుర్తించాం. ఆ ప్రాంతాలను చదును చేసి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలి. కొన్ని రూట్ల నుంచి బస్సులు ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వస్తాయి. మక్కువ తదితర రూట్లలో వచ్చే బస్సులు, వాహనాలకు పట్టణంలోకి అనుమతి లేదు. వాటిని పార్కింగ్ స్థలాల్లో నిలిపేలా చూడాలి.' అని తెలిపారు. పది రూట్లలో 148 బస్సులను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు ఆర్టీసీ అధికారులు చెప్పారు. మద్యం నియంత్రణకు ఐదు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో కార్యనిర్వాహక ఇంజనీర్ వేణుగోపాలనాయుడు, ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డీఎస్పీ ఎం.రామబాబు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అత్యవసర సమావేశం

శ్యామలాంబ పండగ పనులపై శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. శ్యామలాంబ జాతర నేపథ్యంలో రహదారుల నిర్మాణాలు, మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కృషితో సాలూరు పురపాలక సంఘానికి రూ.2కోట్లు మంజూరయ్యాయి. అయితే, నిధులు విడుదలై రెండు నెలలు అవుతున్నా ఇంకా పనులు పూర్తికాలేదు. పండగకు మరో పది రోజుల సమయమే ఉండడంతో ఆలోపు పనులు పూర్తి చేస్తారో లేదోనని సందేహాలు నెలకొన్నాయి. ప్రస్తుతం సాలూరు మున్సిపాలిటీలో వైసీపీ పాలకవర్గం ఉంది. దీంతో పనులు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించి చర్చించనున్నట్లు తెలిసింది. తక్షణం పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తోటపల్లిలో వార్షిక కల్యాణ మహోత్సవం ప్రారంభం 6లో



ఒడిశా టు ఏపీ

● కారులో గంజాయి రవాణా
● 184 కిలోలు స్వాధీనం చేసుకున్న పోలీసులు
● వాహనం వదిలేసి ఇద్దరు పరారీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణ

సాలూరు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ఏపీకి కారులో రవాణా చేస్తున్న గంజాయిని సాలూరు రూరల్ పోలీసులు, ఈగల్ టీం సంయుక్తంగా పట్టుకున్నాయి. రూ.7లక్షల విలువ చేసే సుమారు 184 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాయి. ఈ వివరాలను గురువారం సాలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ పి.రామకృష్ణ విలేకరులకు వెల్లడించారు. దుగ్గసాగరం జంక్షన్ వద్ద సాలూరు రూరల్ పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఒడిశా నుంచి విజయనగరం వైపు వెళ్తున్న కారును ఈగల్ టీంతో కలసి నిలుపుదల చేశారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి వాహనాన్ని వదిలేసి పరారయ్యారు. దీంతో పోలీసులు కారును పరిశీలించగా 86 ప్యాకెట్లతో ఉన్న సుమారు 184 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో కారుని సీజ్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారు నెంబరు ఆధారంగా వివరాలను పరిశీలించగా ఒడిశా రాష్ట్రం పొట్టంగి బ్లాక్ సునాబేడాకు చెందిన నిరుపమా జనా అనే వ్యక్తికి చెందిన కారుగా గుర్తించారు. పోలీసుల తనిఖీల సమయంలో కారును నీరజ్‌కుమార్ బెహరా అనే వ్యక్తి నడుపుతున్నట్టు ప్రాథమికంగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పరారైన వారిని త్వరలో పట్టుకుంటామని అన్నారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయిని విక్రయించినా, అమ్మకాలు చేసినా, సాగు చేసినా, వినియోగించినా 1972కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారంతో ఇప్పటి వరకు సాలూరు, పాచిపెంట పోలీస్‌స్టేషన్ల పరిధిలో 2వేల కిలోల గంజాయిని పట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా పోలీసులు, ఈగల్ టీంను సీఐ అభినందించారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి

వసతి గృహాలపై నిఘా

● సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం
● విద్యార్థుల భద్రతకు పెద్దపీట
● మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు


భద్రగిరి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల

గుమ్మలక్ష్మీపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన వసతి గృహాలపై సీసీ కెమెరాలతో నిఘా పెట్టనున్నారు. అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల భద్రత కోసం వీటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతుంది. జిల్లాలో 65 వసతి గృహాలు ఉన్నాయి. వీటిల్లో 25 వేల మందికి పైగా గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 74 వసతి గృహాలు ఉండగా, ఇక్కడ 15 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని గురుకుల పాఠశాలలు, కళాశాలలు, మినీ గురుకులాల్లో సీసీ కెమెరాలను అమర్చారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీసీ కెమెరాల నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో చాలా వరకు మూలకు చేరాయి. ప్రహరీలు కూడా లేకపోవడంతో తరచూ విద్యార్థులు బయటకు వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. హాస్టళ్లలోకి ఎవరు వస్తున్నారో, వెళ్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. వీటిని దృష్టిలో ఉంచుకొని గిరిజన విద్యార్థుల భద్రతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సీసీ కెమెరాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. దీనివల్ల వసతి గృహాలపై నిఘా పెట్టేందుకు వీలుంటుంది. విద్యార్థుల భద్రత మరింత సులభతరం అవుతుంది. జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో సీసీ కెమెరాలను అమర్చాలని ఇప్పటికే గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి ఆదేశాలు జారీ చేశారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి

గిరిజన పాఠశాలలు, వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే గురుకుల పాఠశాలల్లో సెక్యూరిటీ గార్డులను నియమించింది. అలాగే, ఉపాధి హామీ పథకం కింద ప్రహరీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే చాలా పాఠశాలల్లో రక్షణ గోడల నిర్మాణం పూర్తయింది. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గిరిజన విద్యార్థులను మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కాస్మెటిక్స్‌ను జీసీసీ ద్వారా అదనంగా ఇవ్వడానికి చర్యలు తీసుకుంది. మెనూ చార్జీలు కూడా పెంచింది. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ.1400, ఆపై తరగతుల (మిగతా 6వ పేజీలో)

నందివానివలసలో

ఏనుగులు


నందివానివలసలో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లి పరిసర ప్రాంతాల్లో గత మూడు రోజులుగా సంచరించిన ఏనుగులు గురువారం నందివానివలసకు చేరుకున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నందివానివలస, గిజబ ప్రాంతాల్లో అధికంగా అరటి, పామాయిల్‌తో పాటు పలు రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అయితే, ఏనుగులు ఎక్కడ తమ పంటలకు నష్టం కలిగిస్తాయోనని వారు ఆందోళన చెందుతున్నారు. అవి తమ గ్రామం వైపు రాకుండా అటవీ సిబ్బంది, ట్రాకర్లు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండండి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కరరావు

సీతంపేట రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): వ్యాధుల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని మలేరియాపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు ఆదేశించారు. గురువారం సీతంపేట ఏజెన్సీలో ఆయన పర్యటించారు. వైటీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతి గృహాన్ని పరిశీలించారు. వారికి అందుతున్న వైద్యసేవలు, పౌష్టికాహారం వంటి అంశాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో కుసిమి, దోనుబాయి, మర్రిపాడు, బత్తిలి, భామిని పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హైరిస్క్ గ్రామాలను గుర్తించి ఆయా పీహెచ్‌సీల సిబ్బంది ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే చేపట్టాలని ఆదేశించారు. జ్వరపీడితులు నుంచి రక్తపూతల సేకరించి పాజిటివ్ వచ్చిన వారికి వైద్యసేవలు అందిచాలన్నారు. గిరిజన గ్రామాల్లో దోమల మందు స్ప్రేయింగ్, ఏగింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దోమకాటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో ఏసీటీ, క్లోరోక్విన్, ప్రైమాక్విన్ వంటి యాంటీ మలేరియా మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ సమావేశంలో డీఎంవో జేవీ సత్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతీ, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అప్పలనాయుడు, స్వాధీనం చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్ల సామగ్రి

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా అరెస్టు

లక్కవరపుకోట, మే 8(ఆంధ్రజ్యోతి): గత కొన్ని నెలలుగా సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌లను టార్గెట్ చేస్తూ దొంగతనానికి పాల్పడిన ముఠా గురువారం పోలీసులకు చిక్కారు. ఎస్.కోట రూరల్ సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మర నిఘా పెట్టారు. ఎట్టకేలకు గురువారం పాటూరు గ్రామం వద్ద పోలీసులకు చిక్కారు. ఈ ముఠాలో 8 మందికి గానూ ఆరుగురు చిక్కారు. ఇద్దరు పరారీలో ఉన్నట్టు సీఐ తెలిపారు. పట్టుబడ్డవారిని ఎల్.కోట పోలీసు స్టేషన్‌లో హాజరుపరిచారు. కొత్తవలస, వేపాడ, ఎల్.కోట, జామి మండలాల్లో వీరు దొంగతనాలకు పాల్పడినట్టు తెలిపారు. సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ మోటార్లు, కార్లు, ట్రాక్టర్ల బ్యాటరీలు, పంపుసెట్లు స్టార్టర్లు వీరి టార్గెట్. సుమారు రూ.5లక్షల విలువగల 15 కేసులకు సంబంధించిన వస్తువులను రికవరీ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. మహమ్మద్ అహమ్మద్, ఆర్.బంగారునాయుడు, కే.యోగేంద్ర, సలీమ్, ఆదిత్య, రసూల్‌లను అరెస్టుచేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేపాడ ఎస్ఐ సుదర్శన్, ఎల్.కోట ఎస్ఐ నవీన్‌పడాల్, జామి ఎస్ఐ వీరజనార్ధన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మీ సరుకులు వద్దేవద్దు

● ఒడిశాకు షాక్ ఇచ్చిన కొరియా గ్రూపు గిరిజనులు 6లో

చెత్తశుద్ధి ఏదీ?

(5వ పేజీ తరువాయి)

చెత్తలు, వ్యర్థాలు పెరిగే అవకాశం ఉందని ప్రజారోగ్యశాఖాధికారులే చెబుతున్నారు.

● ఎనర్జీని సృష్టించేందుకు మున్సిపాల్టీలోని 30 వార్డుల నుంచి సేకరిస్తున్న వ్యర్థాలను తమకు సరఫరా చేయాలని గతంలో జిందాల్ ఫ్యాక్టరీ ప్రతినిధులు కోరారు. దీనివల్ల మున్సిపాల్టీకి ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా.. ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా చెత్తశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి స్వచ్ఛ పార్వతీపురమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వసతి గృహాలపై నిఘా

(5వ పేజీ తరువాయి)

చదువుతున్న వారికి రూ.1600 చొప్పున మెనూ చార్జీల కింద ప్రభుత్వం చెల్లించనుంది. నోట్‌పుస్తకాలు, స్టీల్ ప్లేట్లను సరఫరా చేయనుంది. విద్యార్థులకు ప్రతి నెలా క్షవరం చార్జీల కింద రూ.50 చెల్లించనుంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి మాట్లాడుతూ.. త్వరలో జిల్లాలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పనసవలసలో జ్వరాలు

● ఇద్దరికి మలేరియా లక్షణాలు



పనసవలసలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న తోణాం వైద్యసిబ్బంది

సాలూరు రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం కొఠియా గ్రూప్ పట్టుచెన్నారు పంచాయతీ పనసవలసలో జ్వరాలు ప్రబలాయి. చలితో కూడిన జ్వరాలు కావడంతో మలేరియా లక్షణాలుగా అనుమానించి గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. తోణాం పీహెచ్‌సీ వైద్యాధికారి అక్యాన అజయ్ గురువారం వైద్యసిబ్బందిని అక్కడికి పంపించారు. సిబ్బంది 48 మంది నుంచి రక్తపూతలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఇరువురికి మలేరియా లక్షణాలున్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. మరో ఆరుగురికి జ్వరాలుండడంతో మందులు ఇచ్చారు.

డంపింగ్‌యార్డులో మంటలు

పాలకొండ, మే 8 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని డంపింగ్ యార్డులో గురువారం అగ్గి రాజుకుంది. దీంతో పొగ విస్తరించడంతో స్థానికులు నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజుకు సమాచారం అందించారు. ఈ మేరకు అగ్నిమాపకశాఖ సిబ్బంది వచ్చి మంటలపై నీరు చల్లారు. దీనితో పొగ తీవ్రత తగ్గింది.

ఉపాధి పనులపై నిశిత పరిశీలన



బిత్రపాడులో ఉపాధి పనులు పరిశీలిస్తున్న కౌన్సిల్ మెంబర్ లావణ్యకుమార్

జియ్యమ్మవలస, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులపై రాష్ట్ర ముఖ్యమంత్రి కౌన్సిల్ నిశిత పరిశీలన చేస్తోంది. ఈ మేరకు బిత్రపాడు పంచాయతీలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లావణ్యకుమార్ గురువారం పర్యటించి, రెండు చెరువు పనులను పరిశీలించారు. అక్కడ ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఉపాధి పనులు ఒక్కపూట చేసేలా అనుమతి ఇవ్వాలని, బిల్లులు త్వరగా అందించాలని, పని వద్ద కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉపాధి కూలీలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందిం చిన ఆయన.. ఫిబ్రవరి 6 వరకు జరిగిన పనులకు కూలీల అకౌంట్లో జమ అయ్యాయని, మిగిలిన పెండింగ్ బిల్లులు ఈ వారంలోగా జమ అవుతాయ ని తెలిపారు. ఒక్క పూటే పనులు చేయాలన్న విషయం ప్రభుత్వానికి తెలియజేస్తానన్నారు. అనంతరం ఆయన కొమరాడ మండలంలోని మాదలంగి, వన్నాం గ్రామాల్లో జరిగిన పనులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట ఏపీవో ఇతులసీదాస్ ఉన్నారు.

జిరాయితీ భూమి స్వాధీనం

సీతంపేట రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా వివాదస్పదంగా ఉన్న బిల్లమడ గ్రామ సమీపంలోని జిరాయితీ భూమిని సంబంధిత హక్కుదారులకు రెవెన్యూ అధికారులు స్వాధీనపరిచారు. మండల రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో కోర్టు, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూహక్కుదారులైన వెంకటపతిరాజు, ఇతరులకు గురువారం జిరాయితీ భూమిని స్వాధీన పరిచినట్టు తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు. రెవెన్యూ అధికారుల సమక్షంలోనే హక్కుదారుడైన వెంకటపతిరాజు తనకు స్వాధీన పరిచిన భూమిలో హద్దులు వేసుకుని చదును చేసుకున్నాడు. ఎటువంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పాలకొండ డీఎస్పీ రాంబాబు, సీఐ చంద్రమౌళిల ఆధ్వర్యంలో పోలీస్ బలగాలు మోహరించాయి. సీతంపేట, దోనుబాయి ఎస్ఐలు వై.అమ్మనరావు, మస్తాన్‌లు పర్యవేక్షించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

పాలకొండ, మే 8 (ఆం ధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె నిర్వహించను న్నాయి. ఈ మేరకు గురువారం తుమరాడ గ్రామంలో రైస్‌మిల్లు కార్మికులు కరపత్రాలను విడుదల చేశారు. రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గేదెల సత్యం, కార్యదర్శి ఎడ్ల శ్రీనివాసరావు, సీఐటీయూ పాలకొండ మండల కార్యదర్శి కాద రాము మాట్లాడుతూ రైస్‌మిల్లు కార్మికులకు 8 గంటల పనిదినం, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యూటీ తదితర కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమ్మె నోటీసు అందజేత

బొబ్బిలి రూరల్: ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె నిర్వహించనున్న నేపథ్యంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు గురువారం బొబ్బిలి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎల్.రామలక్ష్మికి నోటీసును అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.గౌరీష్, జె.రామారావు, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో మరొకరి అరెస్టు

రామభద్రపురం, మే 8(ఆంధ్రజ్యోతి): గత ఏడాదిలో నమోదైన గంజాయి రవాణా కేసులో 6వ నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్టు బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. గత ఏడాది డిసెంబరు నెలలో ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకు న్నామని చెప్పారు. ఈ కేసులో 9మందికి గాను అప్పట్లోనే ఐదుగురు పట్టుబడగా, మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు. ఈక్రమంలోనే స్థానిక బైపాస్‌రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న దిలీప్‌దుసరా బారిక అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. విచారించగా నేరాన్ని అంగీకరించడంతో అరెస్టు చేశామన్నారు. నిందితుడు ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా పొట్టంగి తాలూకా పొండలు గ్రామానికి చెందిన వాడుగా గుర్తించామని చెప్పారు. కోర్టుకు తరలించామన్నారు. మిగిలిన నిందితులను కూడా పట్టుకునేందుకు నిఘా ముమ్మరం చేస్తున్నామన్నారు.

మీ సరుకులు వద్దేవద్దు

● ఒడిశాకు షాక్ ఇచ్చిన కొఠియా గ్రూపు గిరిజనులు



ఎగువశెంబి సమావేశంలో పాల్గొన్న కొఠియా గ్రూపు గిరిజనులు

సాలూరు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): తమకు ఒడిశా సరుకులు వద్దని కొఠియా గ్రూపు గిరిజనులు ఖరాఖండిగా చెప్పడంతో ఒడిశా అధికారులు కంగుతిన్నారు. కొఠియా గ్రూపు ధూళిభద్ర, ఎగువశెంబి, దిగువశెంబి గిరిజనులతో ఒడిశా పొట్టంగి ఐసీడీఎస్ సీడీపీవో పి.అన్నపూర్ణ, సూపర్‌వైజరు తదితరులు గురువారం ఎగువశెంబిలో సమావేశం నిర్వహించారు. ఒడిశా అంగన్‌వాడీ సరుకులను వద్దనడం, చిన్నారులకు ఒడిశా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపకపోవడంపై వారు ప్రశ్నించారు. సరుకులు తీసుకోవాలని, పిల్లలను పంపాలని కోరారు. ఇందుకు గిరిజనులు ససేమిరా అన్నారు. ఒడిశా సరుకులు, పథకాలు తమకొద్దన్నారు. తమను ఒడిశా పోలీసులు వేధిస్తున్నారన్నారు. తమ పిల్లలు తెలుగు విద్యనే చదువుతున్నారని చెప్పారు. ఏపీ చేపట్టిన పనులు తాము చేయడంతో పలుసార్లు ఒడిశా అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అందుకే ఒడిశా పథకాలు తమకు అవసరం లేదని తెగేసి చెప్పారు. తాము ఏపీలోనే ఉంటామని వారు చెప్పంతో ఆ రాష్ట్ర అధికారులు అవాక్కయ్యారు. ఈ విషయమై తమకు రాసివ్వాలని ఐసీడీఎస్ అధికారులు కోరారు. జిల్లా కలెక్టర్ వస్తే మాట్లాడి రాసివ్వాలో లేదో నిర్ణయిస్తామని గిరిజనులు చెప్పారు. చివరకు ఐసీడీఎస్ అధికారులు చేసేదిలేక వెళ్లిపోయారు. సమావేశంలో గిరిజనులు చెప్పిన విషయాలను పొట్టంగి ఐసీడీఎస్ సీడీపీవో ఉన్నతాధికారులకు నివేదికిచ్చారు.

మహిళలకు అండగా ఉంటాం

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి



కుట్టుశిక్షణను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

గుమ్మలక్ష్మీపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్)లో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. మహిళలు శిక్షణలో రాణించి పలువురికి ఆదర్శం కావాలని ఆమె ఆకాంక్షించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పాడి సుదర్శనరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ కడ్రక కళావతి, ఎంపీడీవో సాల్మన్‌రాజ్, నాయకులు నందివాడ కృష్ణబాబు, వెంపటాపు భారతి, తాడంగి రామారావు, అడ్డాకుల నరేష్, శిక్షణా కేంద్ర నిర్వాహకుడు రాజేష్, వైటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణుల వసతిగృహం సందర్శన

గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని వైటీసీ భవనంలో ఉన్న గర్భిణుల వసతిగృహాన్ని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి గురువారం సందర్శించారు. అక్కడ ఉన్న గర్భిణులతో మాట్లాడి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కొత్తగా విధుల్లో చేరినవారు అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఈమేరకు కొత్తగా విధుల్లో చేరుతున్న ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆయన గురువారం నియామక పత్రాలు అందించారు. సూడిగాం ఫీల్డ్ అసిస్టెంటుగా సారథి లోకేశ్వరరావు, కృష్ణపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌గా కె.సావిత్రి నియమితులయ్యారు. వీరికి నియామక పత్రాలను అందించినట్టు తెలిపారు. ఏపీవో కృష్ణారావు, టీడీపీ నాయకులు జీవీ నాయుడు, గణేష్, శంకరావు, టెక్నికల్ అసిస్టెంట్ సోమేష్ పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పార్వతీపురం రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనారాయణపురంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. సర్వమంగళదేవి పీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ మురపాక కాళిదాసుశర్మ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. ఆలయ నిర్మాణానికి భూమిని విరాళంగా ఇచ్చిన డోకల వెంకటనాయుడు దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. అలాగే ఎమ్మెల్యే తన వంతుగా రూ.10వేలు విరాళం అందించారు.

వీరఘట్టం పట్టణ అభివృద్ధికి కృషి

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ



వీరఘట్టం: సుడా ఛైర్మన్ రవికుమార్‌తో మాట్లాడుతున్న పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం, మే 8 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్‌తో కలిసి ఆయన గురువారం వీరఘట్టం ప్రధాన రహదారిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరఘట్టం ప్రధాన రహదారి 1.7 కిలోమీటర్లలో సెంట్రల్ లైటింగ్ కోసం, కోడిరామ్మూర్తి విగ్రహం కోసం మొత్తం రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. వీరఘట్టం పట్టణ అభివృద్ధిలో వెనుకబడిందని, వీలైనంత ఎక్కువ నిధులు మంజూరు చేసి అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే సుడా ఛైర్మన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సుడా ఎస్ఈ సుగుణాకర్, సుడా ప్లానింగ్ ఆఫీసర్ అమర్నాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కృష్ణమూర్తినాయుడు, వీరఘట్టం పట్టణ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, బల్లా హరిబాబు, చింతా ఉమా, మాచర్ల అనీల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరాయుని కోనేరు పరిశీలన

పాలకొండ, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీలో ఉన్న వెంకటరాయుని కోనేరు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. గురువారం సాయంత్రం వారు వెంకటరాయుని కోనేరును పరిశీలించారు. కోనేరును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలని సుడా ప్లానింగ్ ఆఫీసర్ అమర్‌నాథ్, సీనియర్ ఇంజనీర్ సుగుణాకర్‌కు సూచించారు. డీపీఆర్‌లను తయారు చేసి విడతల వారీగా వెంకటరాయుని కోనేరు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. వీరితో పాటు కూటమి నాయకులు పల్లా కొండలరావు, కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్‌కుమార్, వెన్నపు శ్రీనివాసరావు, కొరికాన గంగు నాయుడు, అంపోలు శ్రీనివాసరావు ఉన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

గరుగుబిల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హత ఉన్న కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పి.బాల కోరారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 25 పంచాయతీల పరిధిలో అర్హత కలిగిన వారు ఆయా పంచాయతీల పరిధిలోని వీఆర్వోలకు దరఖాస్తులు అందించాలని కోరారు. కౌలు కార్డులు కారణంగా భూయజమానికి ఎటువంటి నష్టం ఉండదన్నారు. భూమి కలిగిన వారికి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొత్తాలు జమ అవుతాయని తెలిపారు. కార్డు పొందేందుకు దరఖాస్తు రైతు ఫొటో, ఆధార్ జిరాక్స్, ఫోన్ నెంబరు, అలాగే భూయజమానికి సంబంధించిన ఆధార్ జిరాక్స్ ఫోన్ నెంబరు, 1బీ జిరాక్స్ యజమాని అంగీకార పత్రం (నోటరీ) అందించాలన్నారు. అలాగే నివాస స్థలానికి అర్హులైన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ప్రభుత్వం నుంచి స్థలం పొంది ఉండరాదన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో రహదారులకు ఆనుకుని ఉన్న మొక్కలను తొలగించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు. ● పాలకొండ: పాలకొండ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ పాలకొండ-11 ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వడమ కొత్తకాలనీ, వడమ, ఇందిరా నగర్ కాలనీ, గారమ్మకాలనీ, రాజాం రోడ్డు, గజాలఖానా, తుమరాడ, యరకారాయపురం, గొట్టమం గళాపురం, చినమంగళా పురం, తంపటాపల్లి, బుక్కూరు, రాజుపేట, అర్దలి, భాసూరు, ఎల్.ఎల్.పురం, పద్మాపురం, చినకోటిపల్లి, పెదకోటిపల్లి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలియజేశారు.

చురుగ్గా విద్యుత్ పనులు

గరుగుబిల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని విద్యుత్‌శాఖ ఏఈ బి.శ్రీనివాసులనాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో గృహ అవసరాలకు, వ్యవసాయ పంపు సెట్లుకు ఒకే లైన్ ఉండేదన్నారు. దీనికారణంగా రైతులు వ్యవసాయ పంపు సెట్లుకు వినియోగించిన పరిస్థితి నెలకొనడంతో గృహ అవసరాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని చెప్పారు. ప్రస్తుతం గృహాలకు 24 గంటలు సరఫరాకు ఒక లైన్, వ్యవసాయ పంపు సెట్లుకు 9 గంటల సరఫ రాకు మరొక లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే లోవోల్టేజీ సమస్య ఉన్న తోటపల్లిలో 100 కేవీఏ, రావుపల్లిలో 63 కేవీఏ, ఉల్లిభద్రలో 40 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

వాటర్ ట్యాంకర్‌కు లీకేజీలు

● నగర పంచాయతీ కార్యాలయం ఎదుట నిలిచిన నీరు



కార్యాలయం ఎదుట చేరిన నీరు



ట్యాంకర్ నుంచి కారుతున్న నీరు

పాలకొండ, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలోని వాటర్ ట్యాంకర్‌కు లీకేజీలు కావడంతో ఆ పరిసర ప్రాంతం అంతా నీటితో నిండి బురదమయంగా మారింది. అసలే ఎండాకాలం చుక్కనీరు లేక నగర పంచాయతీలో ఎన్నో వీధుల్లోని ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ తరుణంలో కాలంచెల్లిన వాటర్ ట్యాంకర్‌తో అధికారులు తాగునీటిని వృథా చేస్తుండడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతంలో బురదగా మారడంతో కొనుగోలుదారులు, వ్యాపారులు అసౌకర్యానికి గురవుతున్నారు. నగర పంచాయతీలో నిధులు ఉన్నప్పటికీ పనులకు దిక్కులేదని పలువురు స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకర్లకు మరమ్మతులు చేపట్టి సక్రమంగా నీరు సరఫరా చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



నిలిచిన వాహనాలు

నిలిచిన లారీ.. స్తంభించిన ట్రాఫిక్



రోడ్డు మధ్యలో ఆగిపోయిన లారీ

పార్వతీపురం రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకంపేట గోలీల సెంటర్ వద్ద గురువారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించింది. లారీని వెనక్కు మళ్లించే సమయంలో రోడ్డు మధ్యలో ఆగిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. సుమారు మూడు గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పార్వతీపురం నుంచి బొబ్బిలి, విశాఖపట్నం, విజయనగరం తదితర ప్రాంతాల వైపు వెళ్లే బస్సులు, లారీలు, అటు నుంచి వచ్చే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీనివల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవల్సి వచ్చింది. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి, అవసరమైన చర్యలు చేపట్టారు.

తోటపల్లిలో వార్షిక కల్యాణ మహోత్సవం ప్రారంభం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి దేవస్థానాల పరిధిలో గురువారం కోదండ రామస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కోదండరామస్వామి దేవస్థానంలో కల్యాణ మహోత్సవానికి సంబంధించి ప్రత్యేక పూజలను ఆలయ అర్చకుడు వీవీ అప్పలాచార్యులు నిర్వహించారు. ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ మాట్లాడుతూ వైశాఖ శుద్ధ ఏకాదశి నుంచి శుద్ధ పౌర్ణమి వరకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 12 వరకు దేవస్థానం పరిధిలో నిర్వహిస్తామని, పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా ముడుపుల పూజలు

సీతానగరం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లో సువర్ణముఖి నది పక్కన గల వేణుగోపాలస్వామి, లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో గురువారం ఘనంగా ముడుపుల పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, ఆలయం చుట్టూ 27 సార్లు ప్రదక్షిణలు చేశారు. ప్రతి గురువారం ఇక్కడ ముడుపుల పూజ నిర్వహించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారని ఆలయ అర్చకులు శ్రీని వాసచార్యులు, రామానుజాచార్యులు తెలిపారు.



పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

ఉగ్రవాదం అంతం కావడమే లక్ష్యం

- ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్య ఆపరేషన్ సిందూర్
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కళావెంకటరావు


మాట్లాడుతున్న కళావెంకటరావు

రాజాం, మే 8 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్య ఆపరేషన్ సిందూర్ అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు,చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంక టరావు తెలిపారు.ఉగ్రవాదం అంతంకావడమే అంతిమలక్ష్యం కావాలన్నారు. గురువారం రాజాంలోఆయన విలేకరులతో మాట్లాడుతూ పర్యాటకుల మరణానికికారణమైన వారిపై ప్రతీకారం తీర్చుకోవడం నిజమైన నివాళిగా భావిస్తున్నామని తెలిపారు.భారత సాయుధ బలగాలు ఉగ్రవాదశిబిరాలపై మెరు పుదాడి చేసి గట్టి సమాధానం ఇచ్చాయని చెప్పారు.అమాయకులైన పర్యాటకులను బలిగొన్న ఘటన హృదయ విదారకమైనదని, దేశ సమగ్రతకు చిచ్చు పెట్టాలని చూస్తే సహించబోమని తెలిపారు. చేసిన పపానికి పాకిస్తాన్‌పై మూల్యం చెల్లించుకోక తప్పదని కళా హెచ్చరించారు.

టీడీపీ సభ్యత్వంతో ఆర్థిక భరోసా

- ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి


బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న లలితకుమారి

శృంగవరపుకోట రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో ఆర్థిక భరోసా లభిస్తుందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. మండలంలోని పోతనాపల్లి పంచాయతీలోని ఎరుకుల పేటకు చెందిన టీడీపీ కార్యకర్త సాహూ ప్రకాష్(55) పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్నాడు. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈనేపథ్యంలో కుటుంబం ఇబ్బందులను గ్రామ టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అమె స్పందించి సభ్యత్వ నమోదుకు సంబంధించిన బీమా ఐదు లక్షల నగదు గురువారం కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్ర మంలో మాజీ సర్పంచ్ గేదేల దేముడమ్మ, కూనిరెడ్డి ముత్యాలనాయుడు, నాయకులు ఇందుకూరి శ్రీనివాసరాజు,గోగాడ సత్యం, ఎంపీటీసీమాజీ సభ్యుడు ఈశ్వరరావు, గేదెల పోతయ్య పాల్గొన్నారు.

‘ఉపాధి’ సక్రమంగా నిర్వహించాలి

- నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి


మాట్లాడుతున్న నాగమాధవి

భోగాపురం, మే 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీపథకం పనులు సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. గురువారం మండలంలోని ముంజేరు సమీపంలో గల జనసేన పార్టీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఏపీవోలు,ఈసీలు, టీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతనెలలో నిర్వహించిన పనుల గురించి అడిగి తెలుసుకొన్నారు. నీటి వనరులను భద్రపరచడం,నీటితొట్టెలు పునరుద్ధరించడం ద్వారా నీటి నిల్వలు పెంచుకోవచ్చని సూచించారు.సముద్రతీరంలో తాటి మొక్కలునాటడంతో పర్యావరణం కాపాడడం తోపాటు ఇసుక కొట్టుకుపోకుండా ఉంటుందని తెలిపారు.

పెట్రోల్ బాటిల్‌తో మహిళ హల్‌చల్

- పోలీసులకు ఫిర్యాదుచేసిన రెవెన్యూ అధికారులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న పెట్రోల్ బాటిల్

గజపతినగరం, మే 8(ఆంధ్రజ్యోతి): గజపతినగరం తహసీల్దార్ కార్యాలయానికి గురువారం ఉదయం అధికారులు విధులకు హాజరైన సమయానికి ఓ మహిళ పెట్రోల్ బాటిల్ తీసుకువచ్చి స్థలం ఆక్రమణలకు గురవుతోందని, అధికారులు చర్యలు తీసుకోకపోతే పెట్రోల్ పోసుకొని అంటించుకుంటానని హల్‌చల్‌చేసింది. తహసీల్దార్ బి.రత్నకుమార్ నచ్చజెప్పినా ఆమె వినకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేయడంతోఆమెను అదుపులోకి తీసుకున్నారు. రెవెన్యూఅధికారుల కథనం మేరకు.. పురిటిపెంట పంచాయతీలోని ఎస్సీకాలనీలో సర్వే నెంబర్ 182లో 28వ ప్లాట్‌ను 15 ఏళ్ల కిందట ప్రభుత్వం నగర చినరాములు పేరుగల వ్యక్తికిమంజూరుచేసింది. ఆయనమరణాంతరం 2020లో ఆయన కుమార్తె బొని సరోజిని ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని అమ్మకాన్ని చేపట్టింది. ఇటీవల ఎస్సీకాలనీలో సీపీఎం నాయకులు కుప్పంనాయుడు జ్ఞాపకార్థం ఆ పార్టీ నాయకులు పంచాయతీ అనుమతులతో గ్రంథాలయ పనులు చేపట్టారు.దీంతో బోనిసరోజిని తన స్థలాన్ని మూడు అడుగులు వరకు ఆక్రమణలకు గురయ్యిందని, గ్రంథాలయం పనులు నిలిపివేసి తనకు న్యాయం చేయాలని డిమాండ్‌చేస్తోంది. 53 ఏళ్ల కిందట సీపీఎం నాయకుడు కుప్పంనాయుడు అక్కడ నివాసముండేవారని,బొని సరోజినికి ప్రభుత్వం స్థలం మంజూరుచేయలేదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు గ్రంథాలయం పనులు తాత్కాలికంగా నిలిపివేయాలని నోటీసులు పంపించారు. గ్రామసభలో గ్రంథాలయ నిర్మాణానికి తీర్మానం తర్వాత పనులు చేపట్టేలా ఆదేశాలు జారీచేస్తామని కార్యదర్శి తెలిపారు.అలాగే బొని సరోజినికి అక్కడ స్థలం లేదని అధికారులను బెదిరించడంతగదని ఆర్ఐ, అప్పలరాజు, పంచాయతీ, రెవెన్యూ అధికారులు అసిరివాడు, గోవిందరావులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ ఇరు వర్గాలను పిలిపించి తహసీల్దార్, గ్రామ సెక్రటరీ,గ్రామపెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించుకోవాలని అంతవరకు గ్రంథాలయపనులు నిలిపివేయాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య

కొత్తవలస, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయిని వివాహానికి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజయనగరం రైల్వే పోలీసుల కథనం మేరకు.. కొత్తవలస పంచాయతీ చింతలదిమ్మకు చెందిన కానూరి జైబాలాజీ ఇంటర్ వరకు చదువుకున్నాడు. ప్రస్తుతం ప్రైవేటు బ్యాంక్‌లో హోమ్‌లోన్ ఇప్పించే ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. చదువుకున్న రోజుల్లోనే తన క్లాస్‌మేట్‌తో పరిచయం ఏర్పడింది. ఆమెను ప్రేమించాడు. అయితే మరోవ్యక్తితో వివాహం చేసుకోగా పాప కూడా ఆమెకు జన్మించింది. ఆరునెలల కిందట ప్రేమించిన అమ్మాయి భర్త చనిపోయాడు. ఈనేపథ్యంలో తన తల్లిదండ్రులకు తాను గతంలో ప్రేమించిన అమ్మాయిని వివాహం చేసుకుంటానని చెప్పడంతో అందుకు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన జైబాలాజీ ఈనెల ఐదోతేదీన తన తల్లికి సింహాచలం వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 11గంటల వరకు ఫోన్‌లో మాట్లాడాడు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్‌అని వచ్చింది. జైబాలాజీ తల్లిదండ్రులు ఆచూకీకోసం చుట్టుపక్కల వెతికారు.ఈనెల ఆరోతేదీ రాత్రి కొత్తవలస- కంటకాపల్లి రైల్వేస్టేషన్ మధ్య ప్యాసింజర్ రైలుకు అడ్డంగా వెళ్లడంతో గాయపడి మృతి చెందాడు.దర్యాప్తులో విషయాలు తెలియడంతో తల్లిదండ్రులకు పోలీసులు సమాచారంఇచ్చారు. కేసు దర్యాప్తుచేస్తున్నారు.

మనస్తాపంతో ఒకరు..


అప్పన్న (ఫైల్)

గుర్ల, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలో వల్లాపురానికి చెందిన రుంకాన అప్పన్న(24) గురువారం మధ్యాహ్నం ఎస్ఎస్ఆర్.పేట-కెల్ల జంక్షన్ మధ్య మనస్తాపంతో రైలు కిందపడి మృతిచెందాడు. రైల్వేపోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అప్పన్న ఐదు నెలల కిందట వివాహం చేసుకున్నాడు. భార్య వాణిఅనారోగ్యంతో ఇబ్బందిపడుతోంది. ఆసుపత్రుల చుట్టూ తిప్పడంతో కొంతకాలంగా మనస్తాపంతో అప్పన్న ఇబ్బందులు పడ్డాడు. భార్య అనారోగ్యం వల్ల చేతిలో డబ్బులు కూడా లేకుండాపోయాయి. తాను చనిపోతే బాగుంటుందని అని కొంతమంది స్నేహితుల వద్ద చెప్పేవాడు. ఈనేపథ్యంలో ఎస్ఎస్ఆర్‌పేట సమీపంలో ఉన్న రైలు బ్రిడ్జి వద్దకు వెళ్లి రైలు కిందపడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి వెళ్లారు.రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబసభ్యులు రోదిస్తున్నారు.

అప్పులు తీర్చలేక..


ఫణీంద్ర (ఫైల్)

బలిజిపేట, మే8(ఆంధ్రజ్యోతి):చేసిన అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన బలిజిపేట మండలంలోని గౌరీపురంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ వై.సింహాచలం కథనం మేరకు.. రాజాం మండలం పెనుబాక కు చెందిన కొరయ్ ఫణీంద్ర(27) బలిజిపేట మండలం గౌరీపురం సమీపంలోఉన్న జీడితోటలో గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దింపేట గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో పెద్దింపేట, గౌరీపురం గ్రామాల మధ్య ఉన్న జీడితోటలో ఉరివేసుకున్నా డు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని, పరిశీలించారు. అక్కడ వారికి సూసైట్ నోట్ లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమపేరుతో మోసగించిన వ్యక్తికి పదేళ్ల జైలు

విజయనగరం క్రైమ్, మే 8(ఆంధ్రజ్యోతి):ప్రేమ పేరుతో మోసగించిన ఓ వ్యక్తికి జిల్లా మహిళా కోర్టుకమ్ ఐదో ఏడీజే కోర్టు న్యాయాధికారి ఎన్.పద్మావతి పదేళ్ల కారాగార శిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఎస్పీ కథనం మేరకు.. బొబ్బిలి మండలంలోని సీతయ్యపేట గ్రామానికి చెందిన దివనాపు అఖిల్ అంబేద్కర్ పాచిపెంట మండలానికి చెందిన ఓ మహిళకు ప్రేమిస్తున్నానని నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం వివాహానికి నిరాకరించినట్లుగా 2022లో ఇచ్చిన ఫిర్యాదుతో బొబ్బిలి పీఎస్‌లో అప్పటి సీఐ ఎం.నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. రిమాండుకు తరలించి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు.న్యాయస్థానంలో నిందితుడు అఖిల్ అంబేద్కర్ నేరానికి పాల్పడినట్లుగా నిరూపితం కావడంతో పదేళ్ల కారాగార శిక్ష, 15 వేల జరిమానా విధించారు.

దొంగిలించిన మద్యం స్వాధీనం

కొత్తవలస, మే8 (ఆంధ్రజ్యోతి): దొంగిలించిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసినట్లు కొత్తవలస సీఐ షణ్ముఖరావు తెలిపారు.సీఐ కథనం మేరకు.. కొత్తవలస పంచాయతీ 202 కాలనీ సమీపంలోఉన్న మద్యం షాపులో గతనెల 28వతేదీరాత్రి ఐదుబాక్సుల్లోని 240క్వార్టర్ బాటిళ్లను దొంగిలించుకు పోయారు.ఈమేరకు మద్యం షాపు సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. పాత నేరస్థులుపెండ్రియోహాను, పెండ్రి దర్శనబాబు,పెండ్రి యేసు ముగ్గురు కలిసి దొంగతనం చేసినట్లు పోలీసులు గుర్తించారు.ఈ మేరకు వీరిలో ఇద్దరిని గురువారం కొత్తవలస వద్ద పట్టుకుని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి పాల్పడిన పెండ్రియోహాను, పెండ్రి దర్శనబాబును అరెస్టు చేశారు. మరో నిందితుడుపరారీలోఉన్నారు.

ఆత్మాభిమానానికి భంగం కలిగిస్తే ఊరుకోం

రాజాం, మే 8 (ఆంధ్రజ్యోతి):ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి ఏదో ఒకవిధంగా తప్పుడు రాజకీయాలు చేస్తున్నారని, ఆత్మాభిమానానికి భంగం కలిగించే విధంగా చేస్తే చూస్తూ ఊరుకోమని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు స్పష్టంచేశారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీనాయకుల్లో సమన్వయం లోపించిందని వైసీపీకి చెందిన చానల్‌లో అసత్య కథనాలు సృష్టించి బేరదజల్లే ప్రయత్నాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం రాజాంలో టీడీపీ జిల్లా పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు గురవాన నారాయణరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటగిరి నారాయణరావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఉర్లాపు పోలిరాజు విలేకరులతో మాట్లాడారు. జనసేన కేడర్‌ను ఎమ్మెల్యే చిన్నచూపు చూస్తున్నట్లు తప్పుడుకథనాలు అల్లడం హేయమైన చర్య అని వైసీపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు కన్నంనా యుడు, నాగళ్ల అప్పలనాయుడు, మరిపి జగన్మోహన్‌రావు, మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు బలిఘట్టంలో ఎంఎస్‌ఎంఈ పార్కుకు శంకుస్థాపన

శృంగవరపుకోట రూరల్/ కొత్తవలస, మే 8(ఆంధ్రజ్యోతి):కొత్తవలస మండలంలోని బలిఘట్టంలో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఎస్‌ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

ఆరు రకాల సేవలకు అనుమతి

రేగిడి, మే 8(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారు కొత్త రేషన్‌కార్డుల కోసం, కార్డుల్లో తప్పుఒప్పుల సవరణతోపాటు, కొత్త సభ్యుల చేరిక, పాతసభ్యులు విడదీయడం ఆరు రకాల సేవలకు ప్రభుత్వ అనుమతి ఇచ్చినట్లు తహసీల్దార్ ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైనవారు సచివాలయాల్లో ఈనెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. చిరునామ మార్పు, ఆధార్‌సీడింగ్ ఇతర సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

23 మంది బైండోవర్

కొత్తవలస, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోడుమెరక, తమ్మన్న మెరక, అప్పన్నదొరపాలెం, చినమన్నిపాలెం, ముసిరాం గ్రామాలకు చెందిన 23 మందిని గురువారం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి భవిష్యత్‌లో సారాతయారీ, అమ్మకాలు చేయమని బైండోవర్ చేయించారు. బైండోవర్‌చేసిన వారు మళ్లీ నేరాలు చేసి పట్టుబడితే బైండోవర్ ప్రకారం కట్టిన బాండ్లను జరిమానా కింద వసూలు చేసి కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామని కొత్తవలస ఎక్సైజ్ సీఐ జీఎస్ రాజశేఖరనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు వీఎన్ రాజు, రమ్యశ్రీ పాల్గొన్నారు.

జేజేఎం పకడ్బందీగా అమలు చేయాలి

విజయనగరం కలెక్టరేట్ మే 8 (ఆంధ్రజ్యోతి):జాతీయజల్ జీవన్ మిషన్ (జేజేఎం) ఇచ్చిన మార్గదర్శకాలు మేరకు పథకాన్నిపకడ్బందీగా అమలుచేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టరు సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు.జాతీయ జేజేఎం అడిషనల్ సెక్రటరీ, మిషన్ డైరక్టర్ కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ జల జీవన్ మిషన్ సభ్యులు సూచనలమేరకు కార్యక్రమం అమలులో క్షేత్రస్థాయిలో ఇబ్బందులను సరి చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత తదితరులు పాల్గొన్నారు.

టోకెన్ల పంపిణీలో అవకతవకలు

నెల్లిమర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల అన్నక్యాంటీన్‌లో పేదలకు అన్యాయం జరుగుతోందని బీజేపీ మండలాధ్యక్షుడు మైపాడప్రసాద్ ఆరోపించారు. గురువారం నెల్లిమర్లలో విలేకరులతో మాట్లాడుతూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అమ్మకాలకు సంబంధించి టోకెన్ల పంపిణీల్లో అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు.ఉదయం టిఫిన్‌కు సుమారు 300 మంది వరకు అవకాశం ఉన్నా కేవలం 15 నిమిషాల్లోనే టోకెన్లు లేవని చెతులెత్తేస్తున్నారని ఆరోపించారు. క్యాంటీన్ నిర్వాహకులు ఆహార పదార్థాలను బయటకు తరలిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో జనసేన నాయకులు పతివాడ అచ్చింనాయుడు, రాంబాబు, బీజేపీ నాయకులునారాయణమూర్తి, సురాల సూర్యనారాయణ, కామేశ్వరి పాల్గొన్నారు

ఇళ్ల నిర్మాణానికి సన్నద్ధం చేయాలి

శృంగవరపుకోట రూరల్,మే 8 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో మంజురైన ఇళ్ల నిర్మాణం ఆపేసిన లబ్ధిదారులు ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తిచేసే విధంగా హౌసింగ్‌శాఖ సన్నద్ధం చేయాలని గృహనిర్మాణశాఖ పీడీ మురళీమోహన్ కోరారు. గురువారం ఎస్.కోటలో ఎంపీడీవో సతీష్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో సమీక్షించారు. అనంతరం పుణ్యగిరి లేఅవుట్‌లో అసంపూర్తిగాఉన్న ఇళ్లు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎస్.కోట మండలంలో 3,300 ఇళ్లు ప్రభుత్వం మంజూరుచేసిందని, ఇందులో రెండు వేల ఇళు పూర్తికాగా 300 ఇళ్లు ప్రారంభించలేదని, 1004 ఇళ్లు వివిద దశల్లో ఉన్నాయన్నారు.కార్య క్రమంలో డిప్యూటీ ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

గుర్ల, మే 8(ఆంధ్రజ్యోతి): గ్రామ కార్యదర్శులు గ్రామసచివాలయాల్లో ప్రజల కు అందుబాటులో ఉండాలని ఈవోపీఆర్‌డీ అన్నపూర్ణాదేవి ఒకప్రకటనలో కోరా రు. మంచినీటి సమస్య, విద్యుత్ సౌకర్యం, కాలువలపై శ్రద్ధ చూపాలని తెలిపారు.

చౌకబారు ప్రకటనలు మానుకోండి

- రైతాంగంపై వైసీపీది కపట ప్రేమ
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున


మాట్లాడుతున్న నాగార్జున

విజయనగరం రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రైతాంగంపై వైసీపీ కపట ప్రేమ చూపిస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున ఆరోపించారు. ఇకనైనా వైసీపీ నేతలు చౌకబారు ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు. ఐదేళ్లుగా వ్యవసాయాన్ని, రైతులను విస్మరించిన వైసీపీ నేతలకు హఠాత్తుగా రైతులు, వ్యవసాయం గుర్తుకు వచ్చిందన్నారు. గురువారం విజయనగరంలోని టీడీపీ కార్యాలయంలో నాగార్జున విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ మాటలకు రైతులు మరోసారి మోసపోరన్నారు. ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదని వైసీపీ నేతలు చెబుతున్నారని, నాలుగైదు సంవ త్సరాల్లో రబీ సీజన్‌లో ఎప్పుడైనా ప్రొక్యూర్‌మెంట్ జరిగిందా అని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బొత్స సత్యనారాయణ రైతుల అకౌంట్లలో 14 రోజుల్లో డబ్బులు పడతాయని చెప్పేవారని, కాని సంక్రాంతి దాటినా రైతుల ఖాతాల్లో డబ్బులు పడలేదన్న విషయాన్ని వైసీపీ నేతలు మరిచిపోయారా? అంటూ ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, కర్రోతు నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, కనకల మురళీమోహన్, గంటా పోలినాయుడు, షైలిపిల్లి సింహాచలం, గొర్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్టీఐపై అవగాహన అవసరం

విజయనగరం రింగురోడ్డు, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యకలాపాలు, సమాచారం తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, సమాచార హక్కు చట్టం-2005పై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. గురువారం విజయనగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం అవరణలో సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య ఆర్టీఐ గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కె.అప్పలరాజు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లు పెంచాలి

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సులభ రీతిలో రెవెన్యూ వసూళ్లను పెంచాలని అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మొండి బకాయిలను 15 రోజుల్లో వసూలు చేసే విధంగా కార్యాచరణను రూపొందించాలన్నారు. ఇంకా పన్ను విధించని ఖాళీ స్థలాలకు పన్ను విధించాలన్నారు. అనధికార కుళాయి కనెక్షన్లు గుర్తించి తొలగించాలని ఆదేశించారు. నీటి చార్జీలను త్వరితగతిన వసూలు అయ్యే విధంగా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ అధికారి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సారారహిత గ్రామంగా మీసాలడోలపేట

రేగిడి, మే 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మీసాలడోలపేటను సారా రహిత గ్రామంగా రాజాం ఎక్సైజ్‌శాఖ ప్రకటించింది. ఈమేరకు గురువారం వెంకమ్మపేట సచివాలయంలో రాజాం ఎక్సైజ్ ఎస్ఐ మాన్యాల ఆధ్వర్యంలో సర్పంచ్ బి.కృష్ణ అధ్యక్షతన పంచాయతీ ప్రత్యేకంగా తీర్మానించినట్లు రాజాం ఎక్సైజ్ సీఐ జైభీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మీసాలడోలపేటకు సారా అమ్మకాల్లో ప్రసిద్ధి చెందిందన్న పేరు ఉండేదని పేర్కొన్నారు. ఈక్రమంలో సారాతో పట్టుబడడంతో బైండోవర్ కేసులు నమోదయ్యాయని తెలిపారు.దీంతో జిల్లా ఎక్సైజ్‌శాఖ ఆ గ్రామాన్ని సి కేటగిరిలో చేర్చి, రాజాం ఎక్సైజ్ ఎస్ఐ జి.మాన్యాలను దత్తత అధికారిగా నియమించి నిఘాపెట్టారని పేర్కొన్నారు. నవోదయ-2 కార్యక్రమంలో భాగంగా సారాపై చైతన్యసదస్సులు నిర్వహించినట్లు తెఇపారు. సర్పంచ్ బుగత కృష్ణ ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ కమిటీల ఏర్పాటుచేయడంతోపాటు గ్రామంలో సారా అనర్థాలు తెలియజేస్తు హోర్డింగ్‌లు ఏర్పాటుచేసి చైతన్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామస్థులు ప్రత్యేక తీర్మానం చేయడంతో దత్తత అధికారి మాన్యాలు క్లీన్‌చీట్ ఇచ్చినట్లు సీఐ జైభీమ్ తెలిపారు.

డబ్బులు చెల్లించే వరకూ పనులు చేయవద్దు

- నిలదీసిన తారకరామా తీర్థసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులు


అధికారులతో మాట్లాడుతున్న నిర్వాసితులు

నెల్లిమర్ల, మే 8(ఆంధ్రజ్యోతి): తమ భూములకు డబ్బులు చెల్లించే వరకూ పనులు చేయవద్దని సారెపల్లి గ్రామానికి చెందిన తారకరామా తీర్థసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులు ఆ ప్రాజెక్టు అధికారులను నిలదీశారు. సారెపల్లికి చెందిన తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ సర్పర్ కాలువ నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు సేకరించిన 15 ఎకరాల భూమిలో ప్రాజెక్టు అధికారులు పనులు చేసేందుకు గురువారం వచ్చారు. తమకు రావాల్సిన డబ్బులను ఇవ్వకుండా పనులు చేస్తే ఊరుకునేది లేదని అడ్డుకున్నారు. భూమికి సంబంధించి రూ.3 కోట్ల 17లక్షలు ఇవ్వకుండా విశాఖ ల్యాండ్ సెటిల్‌మెంట్ అథారిటీ ఆఫీసులో డిపాజిట్ చేయడంపై ఈ సమస్య ఉత్పన్నమయ్యింది. సమస్యలను పరిష్కరించకుండా పనులు చేయవద్దని నిర్వాసితులు ఈఈ అప్పలనాయుడు, డీఈ రమణను నిలదీశారు. గట్టు నిర్మాణం జరిగితే ఊరుకునేది లేదని గ్రామస్తులు కోరారు.ఈ సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు చెప్పడంతో సమస్య సద్దుమనిగింది. కార్యక్రమంలో సారెపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బోనుమంతి ఆదినారాయణ, సారెపల్లి బాబూరావు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడూ అప్రమత్తంగా ఉండాలి: సీఐ


మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్, భోగాపురం ఎస్‌హెచ్‌వో సీఐలు బీవీజే రాజు, దుర్గా ప్రసాద్

భోగాపురం, మే8 (ఆంధ్రజ్యోతి):ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలని మెరైన్, భోగాపురం ఎస్‌హెచ్‌వో సీఐలు బీవీజే రాజు, కె.దుర్గాప్రసాద్ కోరారు.గురువారం ముక్కాంలో మత్స్యకారులతో మాట్లాడుతూ భారత్-పాక్ దేశాల ఉద్రిక్తత నేపథ్యంలో సముద్రం వెంబడి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సముద్రంలో ఏమైనా ఇతర పడవలు, బోట్లు కనిపించినా, గ్రామాల్లో గుర్తు తెలియని, అనుమానిత వ్యక్తులు కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.పాపారావు పాల్గొన్నారు.


పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

గంట్యాడ, మే 8(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జీవనరాణి కోరారు. గురువారం మండలంలోని పెద మజ్జిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోరికార్డులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం తామరాపల్లిలో జరిగిన ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం పరిశీలించారు. ఆమెతోపాటు డాక్టర్లు పల్లవి,సతీష్‌లు ఉన్నారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

డెంకాడ, మే 8(ఆంధ్రజ్యోతి): హైరిస్కు గర్భిణులను గుర్తించి వారికి వైద్యుల పర్యవే క్షణలో ప్రసవం జరిగేలా చర్యలుతీసుకోవాలని డీఎంహెచ్‌వో జీవనరాణి కోరారు. బుధవా రం రాత్రి డెంకాడ పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వైద్యుల విధులు, సమయపాలన పరిశీలించారు. ఓపీ రికార్డులు, హెల్త్ ఎఫ్ ఆర్ఎస్‌ను ఎలక్ట్రానిక్ హెల్త్‌రికార్డుల్లో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల వివరాలు నమోదు చేస్తున్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. మందుల నిల్వ రికార్డులు, మాతా శిశు సంరక్షణ సేవలు, ఇతర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయాలని కోరారు. ఆమెతోపాటు సీసీ చంద్రశేఖర్‌రాజు ఉన్నారు.

రాజాం చేరిన సాయి రథం



తిరువీధిలో పాల్గొన్న సాయి సేవాదళ్ సభ్యులు
రాజాం చేరిన సాయి ప్రేమవాహిని రథం

రాజాం రూరల్/రేగిడి, మే 8 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న ప్రేమవాహిని రథం గురువారం రాజాం చేరుకుంది. బాగా నగర్‌లోని శివం మందిరం నుంచి మెయిన్ రోడ్, బొబ్బిలి జంక్షన్ మీదుగా అమ్మవారి కాలనీలోని మళ్లీ సుందరం మంది రం వరకూ సాయి సేవాదళ్ వెంటరాగా తిరువీధి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. గురువారం ఉదయం మండల పరిధిలోని గడిముడిదాంలో సాయి ప్రేమవాహిని రథం పర్యటించింది. తిరువీధి ఉత్సవాలలో జిల్లా కమిటి సభ్యులు సత్యన్నారాయణ, రాజేష్‌కుమార్, రాజాం జోనల్ టీం రాజు, శివం మందిరం అధ్యక్షుడు కె.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

- రేగిడి, అమదాలవలస గ్రామాలకు గురువారం సత్యసా యి ప్రేమవాహిని రథం వచ్చింది. వెయ్యిమంది సాయి భక్తులు స్వాగతం పలికారు. సాయినామ స్మరణ, నగర సంకీ ర్తన చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు, రేగిడి, అమదాలవలస గ్రామాల సాయికమిటీల కన్వీనర్లు, సాయిభక్తులు పాల్గొన్నారు.

రాజబంగారమ్మ తల్లి విగ్రహాల ఊరేగింపు

నెల్లిమర్ల,మే 8(ఆంధ్రజ్యోతి):నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో వారాల పండుగలో భాగంగా గురువారం రాజబంగారమ్మ తల్లి చెక్క విగ్రహాలను ఊరేగించారు. ఈనెల ఒకటో తేదీన దుర్గాలమ్మ అమ్మవారిని తీసుకువచ్చిన విషయం విదితమే. తాజాగా గురువారం రాజబంగారమ్మ తల్లిని తీసుకువచ్చారు. ఈనేపథ్యంలో అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం గ్రామంలోని ఆరిపాక, పారాది ఇంటి పేర్లతో ఉన్న విశ్వబ్రాహ్మణ కుటుంబాలు చెక్కతో తయారుచేసిన రాజబంగారమ్మ తల్లి ప్రతిమలను అమ్మవార్ల కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు, పండుగ నిర్వహణకమిటీ ప్రతినిధులు, గ్రామస్థులు ఊరేగింపుగా వచ్చిప్రతిమలను తీసుకువెళ్లారు.

పహల్గామ్ మృతులకు నివాళి

జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్ సంఘటనలో ముష్కరుల కాల్పుల్లో చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ పలువురు కళాకారులు, నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామస్తులు నివాళులర్పించారు. జరజాపుపేటలోని రాజబంగారమ్మ అమ్మవారి వారాల మహోత్సవాలు పురస్కరించుకుని గ్రామంలో బుధవారం రాత్రి సాంస్కృతిక కార్య క్రమాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వల్లూరు గ్రామానికి చెందిన చందు ఎ టు జెడ్ ఈవెంట్స్ మేనేజర్ మల్లపురెడ్డి చంద్రశేఖర్, కళాకారులు రామలక్ష్మి, వెంకటేష్ పలువురు కళాకారులు భారత జెండాను ప్రదర్శించి మృతులను స్మరించుకున్నారు.

గోపాలపల్లిలో బంగారమ్మతల్లి పండుగ

శృంగవరపుకోట రూరల్,మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపల్లిలో బంగారమ్మతల్లి పండుగను గ్రామస్థులు నిర్వహించారు. గురువారం రాత్రి సర్పంచ్ ఆడారి మహేశ్వరరావు దంపతులు అమ్మవారికి పసుపుకుంకాలు సమర్పించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈనెల 12,13,14 తేదిల్లో ప్రదాన పండుగను నిర్వహిస్తామని తెలిపారు.

డ్యూనాంట్‌కు ఘన నివాళి

జిల్లాలో పలుచోట్ల రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు జాన్‌హెంద్రి డ్యూనాంట్‌కు నివాళులర్పించారు. గురువారం జయంతి పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలువేసి ఆయన సేవలు గుర్తుచేసుకున్నారు.

రాజాం, మే 8 (ఆంధ్రజ్యోతి): రాజాం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ రాజాంశాఖ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కు మార్, శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు తదితరులుజాన్ హెంద్రి డ్యూనాంట్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొం డపల్లి నాగశ్రీ, ఎం.చైతన్య, మరడాన శ్రీరామ్, కొల్ల మశన్ను, శ్రీకాంత్, విజయలక్ష్మి, రవికుమార్, శ్యామల రా వు, వంశీ, ఆదిలక్ష్మి, చంద్రమౌళి పాల్గొన్నారు.

- శృంగవరపుకోట రూరల్,మే 8 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట కొలపర్తి ఆసుపత్రిలో వరల్డ్ రెడ్‌క్రాస్ డే వేడుకలు డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఎస్.కోట చైర్మన్ పోట్నూరు వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఆశపు మల్లేశ్వరరావు, శ్రీనాథ్, వెంకన్నబాబు, గణేష్,పూర్ణచందు, సూర్యారావు పాల్గొన్నారు.


రాజాం: డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు